ప్రజాశక్తి

శుక్రవారం 14 జూన్ 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

నేడు పర్సా శత జయంతి సభ

హాజరుకానున్న బి.వి.రాఘవులు



ప్రజాశక్తి - విజయవాడ : సిఐటియు రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ పర్సా సత్యన్నారాయణ శత జయంతి సభ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది. విజయవాడ గవర్నరుపేట రాఘవయ్యపార్క్ సమీపంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) 3వ అంతస్తులో జరిగే ఈ సభలో ప్రధాన వక్తగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పాల్గొంటారు. ఈ మేరకు సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. సిఐటియు శ్రేణులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిరుద్యోగ యువతలో ఆశలు !

- మెగా డిఎస్‌సిపై సిఎం చంద్రబాబు తొలి సంతకం
- 117 జిఒ రద్దు చేస్తే ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,150 పోస్టులకు అవకాశం
- నోటిఫికేషన్ తర్వాతే స్పష్టత
- ఎన్నికల ముందు 279 పోస్టులకు వైసిపి ప్రభుత్వం నోటిఫికేషన్



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేయడంతో నిరుద్యోగ యువతలో ఆశలను రేకెత్తిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 16,347 పోస్టులు భర్తీ చేయనున్నట్లు సిఎం ప్రకటించారు. అయితే దీనిపై ప్రభుత్వ నోటిఫికేషన్ విడుదలైన తర్వాతే ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎన్ని ఉపాధ్యాయ ఖాళీ పోస్టలను భర్తీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనే విషయం తేటతెల్లం అవుతుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఎన్ని ఉపాధ్యాయ ఖాళీ పోస్టులు భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ (మిగతా 2లో)

పాఠశాలలు పునఃప్రారంభం

- తొలిరోజు 69 శాతం హాజరు
- 1.31 లక్షల స్టూడెంట్ కిట్లు సిద్ధం
- నేటి నుండి పాఠ్యపుస్తకాలు పంపిణీ
- కిట్లను పరిశీలించిన డిఇఒ సుబ్బారావు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : 2024-25 విద్యా సంవత్సరానికి సంబందించి తరగతులు గురువారం నుండి ప్రారంభమయ్యాయి. 50 రోజుల విరామం అనంతరం పాఠశాలలు పున ప్రారంభమయ్యాయి. తొలిరోజు నుండే యథావిధిగా రెండు పూటలా పాఠశాలలు పెట్టడంతో తొలిరోజున విద్యార్థులు పాఠశాలలకు రావడంతో బడులు కళ కళలాడాయి. అంతేకాకుండా ఈవిద్యా సంవత్సరం నుండి విద్యా ప్రణాళికలో కొద్దిపాటి మార్పులు చేయడం, పాఠశాలలు ఆధునీకరణ చేయడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులవుతున్నారు. అంతేకాకుండా ఈఏడాది ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉత్తీర్ణతా శాతం కూడా పదో తరగతిలో పెరిగింది. దీంతో తల్లిదండ్రులు ఎక్కువ మంది ప్రభుత్వ విద్యా సంస్థలలో తమ పిల్లలను చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. తొలిరోజు నుండే పాఠశాలలు ప్రారంభం కావడంతో పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా పాఠశాలలకు వచ్చి విద్యా సంస్థ స్థితి గతులను తెలుసుకవడం కనిపించింది.

స్టూడెంట్ కిట్లు సిద్ధం

ప్రతి ఏటా పాఠశాల విద్యార్థులకు కిట్లను విద్యా సంవత్సరం (మిగతా 2లో)

పింఛన్... పెంచెన్

- ఇకపై సామాజిక పింఛన్ రూ.4 వేలు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 5.04 లక్షల మందికి ప్రయోజనం
- కృష్ణాలో 2.33 లక్షలు, ఎన్‌టిఆర్‌లో 2.71 లక్షలు
- వికలాంగుల పింఛన్ల పెంపుపై స్పష్టత కరువు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఎన్నికల హామీల్లో భాగంగా సామాజిక పింఛన్‌ను రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచారు. పింఛన్‌ను రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచుతూ గురువారం సంతకం చేశారు. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లాలో 5.04 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుంది. ఎన్‌టిఆర్ జిల్లాలో 2.71 లక్షల మందికి, కృష్ణాజిల్లాలో 2.33 లక్షల మంది లబ్ధిపొందనున్నారు. కృష్ణాజిల్లాలో 2,33,838 మంది వివిధ రకాల పింఛన్లు అందుకుంటున్నారు. వీరిలో 34,355 మంది వికలాంగులు ఉన్నారు. వికలాంగులకు నెలనెలా రూ.6 వేలు పింఛను ఇస్తామని ఎన్నికల్లో హామీ (మిగతా 2లో)





సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ ఎస్.డిల్లీరావు, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సిఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకునేందుకు వచ్చిన రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరికి గురువారం పలువురు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), గుడివాడ ఎంఎల్‌ఎ వెనిగండ్ల రాము, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆర్‌జెసి రత్నరాజు, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎస్.రామరావు, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

బదిలీలపై జోరుగా చర్చ

విఎంసి అధికారుల్లో గుబులు

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థలో అధికారుల బదిలీలపై జోరుగా చర్చ జరుగుతోంది. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు ఏర్పాటు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీల్లో భాగంగా విఎంసిలోని పలు విభాగాల్లోనూ అధికారుల బదిలీలు తప్పనిసరిగా ఉంటాయనే చర్చ ఊపందుకుంది. అంతేగాక ఏదో ఒక జిల్లాకు కలెక్టర్‌గా వెళ్లాలనే ఆలోచనతో ఎప్పటి నుంచో తీవ్రంగా ప్రయత్నిస్తున్న విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరిక గత వైసిపి ప్రభుత్వ హయాంలో నెరవేరలేదు. ఎన్నికలకు ముందు చివరి ఏడాదిలో హడావుడిగా పలు ప్రాజెక్టులను ప్రభుత్వం ఆయనకు అప్పగించి వాటిని పూర్తి చేయాలని వైసిపి ప్రభుత్వం తీవ్రంగా వత్తిడి పెట్టింది. ప్రధానంగా స్వరాజ్య మైదానంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతి వనం నిర్మాణం, విగ్రహం ఏర్పాటు, రామవరప్పాడు రింగ్ సెంటరు నుంచి గన్నవరం వరకు విమానాశ్రయ కారిడార్ ఏర్పాటు, కృష్ణానది పరీవాహక ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం, దాని పక్కన పార్కు ఏర్పాటు, సుందరీకరణ... ఇలా పలు పనులను ఆయనకు అప్పగించింది. వీటిని నగరపాలక సంస్థ అధికారుల, ప్రజాప్రతినిధుల సహకారంతో కమిషనర్ పూర్తి చేశారు. ఆయన విఎంసికి కమిషనర్‌గా వచ్చి రెండున్నరేళ్లవుతోంది. ఈనేపథ్యంలో నూతన ప్రభుత్వం తప్పనిసరిగా ఏదో ఒక జిల్లాకు కలెక్టర్‌గా ప్రమోషన్‌పై పంపే అవకాశాలు మెండుగా ఉన్నాయనే చర్చ అధికారుల్లో జోరుగా సాగుతోంది. మిగిలిన అన్ని విభాగాల్లోని అధికారుల బదిలీలు కూడా త్వరలోనే జరుగుతాయని భావిస్తున్నారు. అలాగే విఎంసిలోనే అంతర్గత బదిలీలు కూడా ఉంటాయనే దిశగా చర్చ జరుగుతోది. ఇక్కడ కనీసం మూడేళ్లు సర్వీసు పూర్తిచేసిన అధికారులకు తప్పనిసరిగా బదిలీలుంటాయని తెలిసింది. విఎంసిలో ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారులు, డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులకు తప్పని సరిగా బదిలీలుంటాయని జోరుగా చర్చ జరుగుతోంది. విఎంసి పాలకవర్గం వైసిపి చేతిలో ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికీ ఆ పార్టీకి అనుకూలమైన కొందరు అధికారులు ఉన్నారని, వారందరినీ బదిలీ చేయించేందుకు టిడిపికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు అప్పుడే నూతన ప్రభుత్వం వత్తిడి చేసే పనిలో ఉన్నట్లు తెలిసింది. తమకు నచ్చిన, మెచ్చిన అధికారులను ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి రప్పించుకునే అవకాశం ఉందనే చర్చ జోరుగా సాగుతుంది.

ఏడాదిన్నరలో బందరు పోర్టు జాతికి అంకితం

- ఎంపి వల్లభనేని బాలశౌరి



ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : అభివద్ధి, ఉద్యోగ కల్పనకు వై నాట్ మచిలీపట్నం కాకూడదని పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. వై నాట్ అంటే ప్రజలకు మంచి చేసే ఆలోచనలు రావాలే గానీ కాలం వెళ్లబుచ్చే ఆలోచనలు కాకూడదన్నారు. జనసేన పార్టీ నుండి ఎంపీగా విజయం సాధించిన తర్వాత తొలిసారిగా గురువారం ఆయన మచిలీపట్నం వచ్చారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. గత ప్రభుత్వం నియంతత్వ పోకడలకు పోయి రాష్ట్రాభివద్ధిని భ్రష్టు పట్టించిందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సంక్షేమంతోపాటు అభివద్ధిపై ప్రత్యేక దష్టిసారిస్తామన్నారు. కక్ష సాధింపు చర్యలు తమ విధానం కాదని, అభివద్ధే తమ నినాదం అన్నారు. గత వైసిపి పాలనలో ఇబ్బందులు (మిగతా 2లో)



సుందరీకరణకు విఎంసి కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : నిత్యం రద్దీగా ఉండే ఎంజి రోడ్ బెంజ్ సర్కిల్ జంక్షన్ నుండి రామవరప్పాడు వెళ్లే ఏలూరు రోడ్, సర్వీస్ రోడ్‌లను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం పరిశీలించారు. జాతీయ రహదారి, విఎంసి అధికారులతో పరిశీలించి బెంజిసర్కిల్ బ్యూటీఫికేషన్‌పై అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సజన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎఎస్ఎన్.ప్రసాద్, చంద్రశేఖర్, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్ చీరన్ రాయ్, నేషనల్ హైవే సైట్ ఇంజినీర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో వర్షం

ప్రజాశక్తి-విజయవాడ: నగరంలో గురువారం ఉరుములతో కూడిన జల్లు వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల సమయములో కురిసిన వర్షానికి ప్రజలు కొంత ఉపశమనం పొందారు. వర్షాకాలం ప్రారంభమైన పూర్తి స్థాయిలో వర్షాలు కురవక, ఎండలు, ఉక్కపోత, ఉష్ణోగ్రతలు తగ్గకపోవడంతో ప్రజలకు కొంత ఇబ్బందిగానే ఉంది. మధ్యాహ్నం వరకు కొంత ఎండగా ఉన్నా ఆ తరువాత వాతావరణం చల్లబడింది. సాయంత్రం సమయానికి ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షం కురిసింది.

వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన విద్య

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : సాంఘిక సంక్షేమ వసతి గహాల్లో ఉండి చదువుకుంటున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. ప్రి మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ సాంఘిక సంక్షేమ, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు, వసతి గహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వసతి గహాల్లో ప్రవేశాలు, బోధన, నిర్వహణ, గత పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలు తదితరాలపై చర్చించారు. ఈసమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ్ డీడీ కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్, సూపరింటెండెంట్ ఎ.ఆంజనేయులు, సాంఘిక సంక్షేమ, సహాయ సాంఘిక సంక్షేమ, వసతి గహపు సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి జనార్దనరెడ్డి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ కనక దుర్గమ్మను గురువారం పలువురు మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. రాష్ట్ర మంత్రులు బిసి జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత తదితరులు దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. వారికి ఆలయ ఈవో కెఎస్ రామరావు స్వాగతం పలికారు. అలాగే గురువారం సందర్భంగా దక్షిణామూర్తి స్వామికి ఆలయ వైదిక సిబ్బంది శాస్త్రోక్తంగా అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన బొమ్మారెడ్డి శివమ్మ లక్ష రూపాయలను విరాళంగా ఇచ్చారు.

అభివృద్ధి వ్యూహాల అమలుకు కషి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) కింద కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన జిల్లాలోని ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు మండలాల్లో అభివద్ధి వ్యూహాలను ప్రణాళికాయుతంగా అమలు చేయడం ద్వారా లక్ష్యాలను చేరుకోవచ్చని, ఇందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డిల్లీరావు అధికారులకు సూచించారు. గురువారం న్యూఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఆకాంక్షిత జిల్లాలు, బ్లాక్‌లలో పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వర్చువల్ సమావేశానికి కలెక్టర్ డిల్లీరావు.. అధికారులతో కలిసి ఆర్ అండ్ బీ భవంతిలోని ఎన్ఐసీ కార్యాలయం నుంచి హాజరయ్యారు.



కరపత్రాల ఆవిష్కరణలో ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, వి.బి.రాజు, ఐ.భాస్కరమ్మ తదితరులు

పర్సాను స్ఫూర్తిగా తీసుకోవాలి

శత జయంతి సభ కరపత్రాల ఆవిష్కరణలో ఎన్‌సిహెచ్.శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పర్సా సత్యనారాయణను స్ఫూర్తిగా తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సిఐటియు తూర్పు సిటీ ఆధ్వర్యాన గురువారం జరిగిన విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రి శానిటేషన్ సెక్యూరిటీ గార్డ్సు విస్తృత సమావేశంలో 'పర్సా సత్యనారాయణ శత జయంతి సభ' కరపత్రాలను ఆవిష్కరించారు. శానిటేషన్ కమిటీ అధ్యక్షురాలు ఐ.భాస్కరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల కోసం పర్సా తన జీవితాన్ని తుదివరకూ త్యాగం చేశారని గుర్తుచేశారు. ఎంఎల్‌ఎగా బాధ్యతలు నిర్వర్తించడంతోపాటు సిఐటియు రాష్ట్ర అధ్యక్షునిగా 32 ఏళ్లపాటు ఉన్నారని, స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారని వివరించారు. ప్రజలకు నిస్వార్థమైన సేవలందించారని కొనియాడారు. పాల్వంచ ఎంఎల్‌ఎగా ఉన్న ఆయన విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి మద్దతుగా రాజీనామా చేశారని గుర్తుచేశారు. ఆయనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, సేవా కార్యక్రమాలు, రక్తదానాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంల సిఐటియు తూర్పు సిటీ అధ్యక్షులు వి.బి.రాజు, నాయకులు ఎస్‌కె.అఖిలమ్మ, డి.రత్నకుమారి, కె.జయలలిత, రంగమ్మ, ఎ.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లును కలిసిన ఎంపి శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లా మంత్రి కొల్లు రవీంద్రను గురవారం విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి నివాసంలో రవీంద్రను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో గుడివాడ ఎంఎల్‌ఎ వెనిగండ్ల రాము, టిడిపి జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నిరుద్యోగ యువతలో ఆశలు

ఇస్తుందనేది నిరుద్యోగ యువతకు, ఉపాధ్యాయులకు ఆసక్తిగా మారింది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జివోను రద్దు చేస్తే ఉమ్మడి జిల్లాలో 1,150 పోస్టులకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

కృష్ణాజిల్లా డిఎస్‌సి శిక్షణా కేంద్రాలకు పెట్టింది పేరు. అవనిగడ్డ, పామర్రుల్లోని శిక్షణా కేంద్రాల్లో నిరుద్యోగ యువత నిరంతరం శిక్షణ పొందుతోంది. ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డిఎస్‌సి ప్రకటన కోసం నిరుద్యోగ యువత ఎదురు చూస్తోంది. 117 జిఒకు ముందు మూడేళ్లక్రితం ఉమ్మడి జిల్లాలో 1,150 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీ పోస్టుల భర్తీకి ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. లక్షలు వ్యయం చేసి శిక్షణ పొందిన అభ్యర్థులంతా ఉసూరుమన్నారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు 103, స్కూల్ అసిస్టెంట్‌లు 111. టిజిటి పోస్టులు 65 చొప్పున మొత్తం 279 ఖాళీ ఉపాధ్యాయ పోస్టులకు మొక్కుబడిగా నోటిఫికేషన్ ప్రకటించింది. డిఎస్‌సి పరీక్షలు మాత్రం నిర్వహించలేదు. దీనిపై ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత అభ్యంతరాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగ కల్పనను నిర్లక్ష్యం చేసిందని నిరుద్యోగ యువకులు, పాఠశాలల్లో ఖాళీలు ఎక్కువగా ఉండడంతో తమపై భారం పెరిగిందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు.

117 జిఒను రద్దు చేస్తే 1,150 పోస్టులు ఖాళీ

వైసిపి ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన విద్యావిధానం ప్రభుత్వ పాఠశాలల ఉసురుతీసింది. 117 జివోను తీసుకు వచ్చి మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసింది. విద్యార్థుల సంఖ్యను ఆధారం చేసుకుని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేసేందుకు పూనుకుంది. ఈ క్రమంలోనే జిల్లాలోని 735 ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసింది. మరో 650 పోస్టులను బ్లాక్ లిస్టులో పెట్టింది. ఈ క్రమంలోనే గత ప్రభుత్వం తీసుకు వచ్చిన 117 జివోను రద్దు చేస్తేనే పోస్టుల సంఖ్య పెరుగుతుందని, ఈ దిశగా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ యువత కోరుతోంది.

పింఛను...పెంచెన్...

ఇచ్చారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

కృష్ణాలో 878 మంది డప్పు కళాకారులు, 120 మంది ఇతర కళాకారులు, 34,355 మంది వికలాంగ, 6,233 మంది మత్స్యకార్మికులు, 1,17,308 మంది వృద్ధులు, 7,817 మంది ఒంటరి మహిళలు, 59,349 మంది వితంతు మహిళలు, 3,275 మంది గీత కార్మికులు, 467 మంది చర్మకారులకు 4001 మంది చేనేత కార్మికులు పింఛను పంపిణీ జరుగుతోంది. ఒక్కొక్కరికి నెలకు రూ.3 వేల చొప్పున మొత్తం 2,33,838 మందికి జిల్లాలో నెలనెలా రూ. 70 కోట్లా 15 లక్షల 14 వేలు నగదు పంపిణీ చేస్తున్నారు. వికలాంగులు 34,355 మందిని మినహాయిస్తే మిగిలిన 1,99,483 మందికి ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున నెలనెలా 79 కోట్లా 79 లక్షల 32 వేలు పంపిణీ చేయాలి. వీరందరికి ఏప్రిల్ నుంచి ప్రకటించిన పింఛను అందిస్తామని చెప్పారు. మూడు నెలల బకాయి నెలకు వెయ్యి చొప్పున ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున రూ.59 కోట్లా 83 లక్షల 14 వేలు అదనంగా చెల్లించాలి. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాలో మొత్తం 2.71 లక్షల మందికి రూ.81.30 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ఇప్పుడు వారికి నెలకు రూ.108.40 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది. మూడు నెలల బకాయి నెలకు రూ.1000 చొప్పున ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున అదనంగా 81.30 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

వికలాంగుల పింఛనుపై స్పష్టత కరువు

వికలాంగులకు నెలనెలా రూ.6 వేల చొప్పున పింఛను పంపిణీ చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు ప్రకటించారు. కృష్ణాజిల్లాలో 34,355 మంది వికలాంగులకు ఇప్పటి వరకు నెలనెలా రూ.3 వేల చొప్పున 10 కోట్లా 60 లక్షల 65 వేలు పంపిణీ చేస్తున్నారు. హామీ ఇచ్చిన విధంగా పింఛన్లు పెంచితే నెలనెలా దీనికి రెట్టింపు రూ.21 కోట్లా 21 లక్షల 13 వేలను ఇకపై నెలనెలా చెల్లించాలి. నెలనెలా రూ.3 వేల చొప్పున మూడు నెలల బకాయిలకు మరో రూ.30 కోట్లా 91 లక్షల 95 వేలు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

పాఠశాలలు పున:ప్రారంభం

తొలిరోజు నుండే విద్యార్థులకు అందిస్తారు. అయితే గత ఏడాది వరకు విద్యార్థులకు ఇచ్చే కానుకను ' విద్యా కానుక'గా పంపిణీ చేశారు. అయితే నూతన ప్రభుత్వం రావడంతో ఈవిద్యా సంవత్సరం నుండి వాటిని ' స్టూడెంట్ కిట్లు 'గా నామకరణం చేసి పంపిణీకి సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా మండల శాఖ కార్యాలయాల నుండి పాఠశాలలకు కిట్లను పంపిణీ చేశారు. శుక్రవారం నుండి ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 1.31 లక్షల మంది విద్యార్థులకు కిట్లు అవసరం అని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం సాయంత్రం నాటికి 89వేల కిట్లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. స్టూడెంట్ కిట్‌లో నాణ్యమైన బ్యాగుతో పాటు షు, బెల్టు, నోట్ పుస్తకాలను అందించనున్నారు.

తొలిరోజు 70 శాతం హాజరు

ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా 1454 పాఠశాలలు ఉండగా తొలిరోజు 69 శాతం విద్యార్థులు హాజరు నమోదైంది. గత ఏడాదితో పోల్చితే ఈఏడాది విద్యార్థులు హాజరు శాతం పెరిగింది. అయితే వారం రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేరికపై వివిధ కార్యక్రమాలను ఆయా పాఠశాలల పరిధిలో నిర్వహించనున్నారు. నూరుశాతం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు రప్పించే విధ:ంగా ప్రత్యేక ప్రణాళికను రచించారు. ఆవిధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం పనిచేస్తుంది.

కిట్లను పరిశీలించిన డిఇఒ సుబ్బారావు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందచేసే స్టూడెంట్ కిట్లు ఆయా పాఠశాలలకు వచ్చాయి. దీనితో గురువారం ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు పరిశీలించారు. నగరంలోని కర్నాటి రామమోహణరావు నగరపాలక సంస్థ పాఠశాలల్లో విద్యార్థులకు అందచేసే కిట్లను, యూనిఫాం తదితర వాటిని పరిశీలించారు. వాటిని త్వరిత గతిన విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చినట్లు విద్యాశాఖాధికారి సుబ్బారావు తెలిపారు.

ఏడాదిన్నరలో బందరు పోర్టు జాతికి అంకితం

పడిన జనసైనికులు ప్రతిదాడులకు దిగవద్దని విజ్ఞప్తి చేశారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకొచ్చి మచిలీపట్నం పోర్టు నిర్మాణాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. పోర్టు నిర్మాణంతోపాటు నాలుగైదు వేల ఎకరాల్లో పరిశ్రమలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో రెండు మూడు ప్రాంతాల్లో ఆయిల్ రిఫైనరీల ఏర్పాటుకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ముందుకు వచ్చిందన్నారు. వారితో మాట్లాడి మచిలీపట్నంలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు తనవంతు కషి చేస్తానన్నారు. అలాగే తీర ప్రాంత గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఇతర ఎమ్మెల్యేలతో సమీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రం నుండి మ్యాచింగ్ గ్రాంట్ తీసుకువచ్చేలా తనవంతు కషి చేస్తానని బాలశౌరి తెలిపారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకష్ణ, నాయకులు మాదివాడ రాము, అంజత్ బాషా, కొట్టె వెంకట్రావ్, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులు అడ్డుకోవడం తగదు : ఎంపి



మాట్లాడుతున్న ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పేర్ని నాని లాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండటం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి విమర్శించారు. గురువారం మున్సిపల్ నగరపాలక సంస్థ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం బాల శౌరి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ 2.0 కింద దాదాపు 57.33 కోట్ల నిధులు బందరు పట్టణంలో వెనుకబడిన వర్గాలు ఉండే కాలనీల్లో తాగునీటి సరఫరా, డ్రెయిన్ల నిర్మాణం, పలు కాలనీల్లో మురుగు సమస్యలకు పరిష్కారం, మంచి నీటి చెరువు వద్ద సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరయ్యాయని అధికారులు వివరించారు. కానీ రాజకీయ ఒత్తిడుల వల్ల అనుమతులు రాలేదని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ.. మచిలీపట్నం పట్టణం అభివృద్ధి చెందకుండా అడ్డుకోవాలని అనుకోవడం మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని దుర్మార్గానికి నిదర్శనం అన్నారు. మచిలీపట్నంలో భూగర్భ డ్రైయినేజీ నిర్మాణానికి తాను చొరవ చూపి, కేంద్ర ప్రభుత్వం నుంచి ఓ బందం వచ్చేందుకు సిద్ధం కాగా.. వారిని రానివ్వకుండా మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని అడ్డుకున్నాడన్నారు. ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభిసీతారామయ్య స్మారక ఆడిటోరియం నిర్మాణానికి స్థలం ఇవ్వకుండా అడ్డుకున్నారని. అంబేద్కర్ భవన నిర్మాణం నిలుపుదల చేశారని, ఇక ఎంపీ నిధులకు సంబంధించిన పనులు కూడా ముందుకు సాగకుండా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసిన ఘనత పేర్ని నానికే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బాపి రాజు,ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



మంత్రి కొల్లుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌పి

మంత్రి కొల్లుకు ఎస్‌పి శుభాకాంక్షలు

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : రాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేసిన మచిలీపట్నం శాసన సభ్యులు కొల్లు రవీంద్రను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ గురు వారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శు భాకాంక్షలు తెలిపారు.

కొనకళ్లను కలిసిన ఎంపి బాలశౌరి

కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావును మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలసౌరి గురువారం మర్యాదకపూర్వకంగా కలిశారు. అనంతరం తాజా రాజకీయా పరిణామాల గురించి కృష్ణా జిల్లా అభివృద్ధి గురించి చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వీరితోపాటుగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బండి రామకృష్ణ ,జనసేన నాయకులు మాదివాడ రాము, టిడిపి పట్టణ అధ్యక్షులు,ఇలియాస్ పాషా,యార్లగడ్డ సీతారామయ్య ,జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్ తదితరులు ఉన్నారు.

మండల మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఉపాధి హామీ ద్వారా మనిషికి కనీసం 100 రోజుల పనిదినాలు చూపించకపోతే ఎలా బతికేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి రాణితో రెడ్డిపాలెం గ్రామ మహిళలు మొర పెట్టుకున్నారు. ఈనెల 17 వ తేదీ న వడ్లమన్నాడు గ్రామంలో జరిగే మండల స్థాయి మహాసభ ప్రచారంలో భాగంగా వడ్లమన్నాడ, రెడ్డిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను గురువారం కలిశారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు సంఘంలో సభ్యులుగా చేరితే బలోపేతం అవుతుందని తద్వారా ప్రభుత్వాలపై పోరాడడం తేలిక అవుతుందని తెలిపారు. మండల స్థాయి మహాసభను జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బి.వి. శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి కటికల యాకోబు, గ్రామ ఉపాధ్యక్షురాలు పామర్తి రమాదేవి, పి.రామసాయి , ఎమ్.కనకదుర్గ, ఎమ్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంకాయలపాటి రాణి

ముగిసిన వాలీబాల్ పోటీలు



గుడివాడ : స్థానిక ఎజికె మున్సిపల్ పాఠశాల వాలీబాల్ కోర్టులో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల వాలీబాల్ పోటీలు గురువారం విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీలలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.నాగేశ్వరరావు జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వై కిరణ్‌కుమార్, మత్స్యుంజ యరావుల జట్లు ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో విజేతలకు విజయనంద జూనియర్ డిగ్రీ కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ కె.జ్యోతిరాజు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో పిడిలు గుంటూరు ప్రసాద్, జై శ్రీనివాసరావు, సిహెచ్ రవి, ఎం రాంబాబు ఎంపైర్లుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు పలువురు సత్కారం



బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న హెచ్‌డబ్ల్యూలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ అసెంబ్లీ నుండి జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికైన మండలి బుద్ద ప్రసాద్ ను నియోజకవర్గంలోని పలు శాఖలకు చెందిన అధికారులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు ఆధ్వర్యంలో బుద్ధప్రసాదను ఆయన ఇంటి వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పులిగడ్డ గురుకుల పాఠశాలకు చెందిన ఉపాధ్యా యులు సిబ్బంది బుద్ద ప్రసాద్ స్వగహానికి వచ్చి ఆయనను ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్ ను పూల గుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించారు. కాగా అవనిగడ్డ మొవ్వ సబ్ డివిజన్ కు చెందిన వ్యవసాయ శాఖ ఏడిఏలు ఏవోలు బుద్ద ప్రసాదును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు అదేవిధంగా అవనిగడ్డ సబ్ డివిజన్ సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సాల్మన్ రాజు ఆధ్వర్యంలో హెచ్‌డబ్ల్యూ లు బుద్ద ప్రసాద్ ను పోలగుచ్చం ఇచ్చి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** అవనిగడ్డ శాసనసభ్యునిగా ఎన్నికై మొదటిసారి ఘంటసాల విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్‌ను, ఆయన కుమారుడు మండలి మండలి వెంకట్రామ్ (రాజా)లను కష్ణా జిల్లాపరిషత్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకష్ణ ఇంటివద్ద గురువారం సత్కరించారు. ఈకార్యక్రమంలో ఘంటసాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, కార్యదర్శి పరిసే చలపతి రావు, గ్రామ ఉపసర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్ , పిఏసియస్ మాజీ అధ్యక్షులు బండి పరాత్పరరావు లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చల్లపల్లి మండలం కమిటీ నాయకులు గురువారం అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ద ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కమిటీ జాయింట్ సెక్రెటరీ కిరణ్ , చల్లపల్లి మండల కమిటీ అధ్యక్షులు పి సురేష్ బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ జి దివ్యసాయి, చల్లపల్లి మండలంలోని సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుడివాడ : రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గుడివాడ రైల్వేస్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 55 సంవత్సరాల వయసు కలిగి ఉన్న వ్యక్తిని దోసపాడు రైల్వే స్టేషన్ - గుడివాడ రైల్వే స్టేషన్ మధ్యలోని అప్ లైన్ రైల్వే ట్రాక్ పై రైల్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు బులుగు కాషాయం రంగు గడులు గల తెలుపు హాఫ్ హాండ్స్ షర్ట్, ఎరుపు గడులు గల బులుగు లుంగి ధరించి ఉన్నట్లు, మృతుని కుడి చేతి మీద శ్రీరాములు అనే పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐకి ఫోన్ నెంబర్ 9440627570 సమాచారం ఇవ్వాలని కోరారు.

టిడిపి కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం లంకపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గువ్వాబత్తిన బాలకృష్ణపై అదే గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, అతని కుటుంబసభ్యులు, అనుచరులు బుధవారం రాత్రి దాడి చేశారు. సేకరించిన వివరాల ప్రకారం సీఎం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామంలో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ కార్యకర్తలతో వస్తున్న బాలకృష్ణపై మాడెం నాగరాజు, మాడెం బాలాజీ, మాడెం కోటేశ్వరరావు, కొండపల్లి ఆంజనేయులు, కళ్లేపల్లి శ్రీనివాసరావులు కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో బాలకష్ణ తల మీద, మెడపై తీవ్ర గాయం కావటంతో 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలకష్ణ ఫిర్యాదు మేరకు ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని ఎలుకపాడు గ్రామానికి చెందిన సిపిఎం అభిమాని ప్రొద్దుటూరు దావీదు (38) గురువారం హఠాన్మరణం చెందారు. ఆయన భౌతిక కాయాన్ని పార్టీ మండల కార్యదర్శి అజ్జీరా వెంకటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు పులి శ్రీనివాసరావు, శాఖ కార్యదర్శి కుక్కమళ్ళ ప్రసంగి, మాతంగి సంతోష్ తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. దావీదు కు భార్య, కుమార్తె, కుమారుడు, తల్లి ఉన్నారు.

వైసిపికి దేవరపల్లి రాజీనామా



గుడివాడ : బిసి నాయకుడు దేవరపల్లి కోటి వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గురువారం స్థానిక బంటుమిల్లి రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కోటి మాట్లాడుతూ ప్రజా తీర్పును ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. ప్రజలు టిడిపి, జనసేన, బిజెపిలకు ఓట్లు వేసి గెలిపించిన్పుడు తమ లాంటి వారు ఓడిపోయిన పార్టీలో ఉండడం మంచిది కాదని తాను వైసిపి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్‌పై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం

గుడివాడ : స్థానిక ధనియాలపేటలోని ప్రణవాశ్రమంలో గురువారం శ్రీ శ్రీ నిర్వికల్పానంద భారతిస్వామి వారి 20 ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి అభిషేకాలు అర్చనలను శ్రీ ప్రణవాశ్రమం పీఠాధిపతి శ్రీ శ్రీ సైర్యానంద సరస్వతి స్వామి నిర్వహించారు. అనంతరం అన్నదానం కర్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పెయేటి చంద్రశేఖర, రేలా శివప్రసాద్, ఆశ్రమం మేనేజర్ రామదేని వేణుబాబు, సభ్యులు ఆదిరాజు మల్లికార్జునరావు, నల్లారి శేషగిరిరావు, మల్లంపల్లి వెంకట్రావు, పురోహితులు పొన్నాల గోపాలకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పర్సా జీవితం నేటి తరానికి ఆదర్శం

శత జయంతి కార్యక్రమంలో బాబూరావు

విజయవాడ: కార్మిక నేత పర్సా సత్యనారాయణ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు, సిపిఎం రాష్ట్ర నేత పర్సా సత్యనారాయణ శత జయంతి కార్యక్రమం సత్యనారాయణపురం శివాజీ కేఫ్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ సత్యనారాయణ రాష్ట్రంలో కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించారని చెప్పారు. మూడు దశాబ్దాల పాటు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులుగా కార్మికుల సంక్షేమానికి విశేష కృషి చేశారన్నారు. 1962లో పాల్వంచ నుండి కమ్యూనిస్టు శాసనసభ్యుడిగా ఎన్నికై విశాఖ ఉక్కు నిర్మాణం కోసం రాజీనామాతో పదవి త్యాగం చేశారని తెలిపారు. అంతిమ శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని చెప్పారు. నేడు రాష్ట్రంలో నిరంకుశ వైసిపి ప్రభుత్వంపై ప్రజాగ్రహం పెల్లుబీకిందన్నారు. బిజెపి విచ్ఛిన్నకర ఎజెండాను ప్రజలు తిరస్కరించారన్నారు. రాజ్యాంగం, లౌకిక తత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటర్లు ఇండియా వేదికను బలోపేతం చేశారని చెప్పారు. పదేళ్ల పాటు దేశంలో ఏకపక్ష, నిరంకుశ పాలన సాగించిన బిజెపి, మోడీకి ప్రజలు అడ్డుకట్ట వేశారన్నారు. 400 సీట్లతో రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రపన్నిన బిజెపికి దేశ ప్రజలు మెజార్టీ లేకుండా చేశారన్నారు. ఇప్పటికైనా బిజెఎ ప్రభుత్వం తీరు మారాలన్నారు. విద్వేష రాజకీయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రాష్టాల హక్కులు, ఫెడలిజానికి విఘాతం కల్పించకుండా అడ్డుకోవాలన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. దేశ రాజకీయాలలో బిజెపి ప్రభుత్వాన్ని నియంత్రణలో పెట్టాల్సిన బాధ్యత ఎన్డీఏలోని లౌకిక పార్టీలపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు, పౌర సమాజం రాష్టంలోని ఎన్డీఏ పార్టీలకు ప్రజా చైతన్యం ద్వారా మార్గ నిర్దేశం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, సిపిఎం నేతలు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, బి.రమణ, టి.ప్రవీణ్, సిహెచ్.శ్రీనివాస్, మురళి, సాగర్, బాలాజీ పాల్గొన్నారు.



పర్సా సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు



వైసిపి అక్రమాలపై చర్యలు : బుద్దా

ప్రజాశక్తి-వన్‌టౌన్: వైసిపిలో మంత్రులు, ఎమ్మెల్యేలు బూతులు తిడితే జగన్, విజయసాయిరెడ్డికి కనిపించలేదా అంటూ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఫైర్ అయ్యారు. గురువారం బుద్ధా వెంకన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుద్ధా మాట్లాడుతూ కొడాలి నాని, వంశీ అనే పిల్లల తాటాకు చప్పుళ్లకు మురిసిపోయారని అన్నారు. దాడులు చేయవద్దని తమ నాయకులు ముందే చెప్పారని, ఎక్కడో ఏదో ఒక ఘటన జరిగితే విజయసాయి రెడ్డి రాద్ధాంతం చేస్తున్నారని బుద్ధా మండిపడ్డారు. ఈ ఐదేళ్లలో వైసిపి వాళ్ల నోళ్లు ఎందుకు అదుపు చేయలేదన్నారు. ప్రభుత్వం పోగానే పిల్లి అరుపులు అరుస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రను దోచేశాడని, వీటిపై విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిజంగా తాము దాడులు చేయాలని అనుకుంటే... ఇలా ఉంటుందా పరిస్థితి అన్నారు. కక్ష సాధింపు రాజకీయాలు వద్దని తమ అధినేత ప్రకటించారని చెప్పారు. జగన్ ఎప్పుడైనా ఇలా ఒక్క ప్రకటన చేశాడా అన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం అద్భుతంగా జరిగిందని, దానిని డైవర్ట్ చేయడానికే విజయసాయి రెడ్డి ప్రెస్ మీట్ పెట్టాడని, సింహాలు, పులులు అన్న వాళ్లు అధికారం పోగానే పిల్లులు అయిపోయారా అని ఎద్దేవా చేశారు. టిడిపి కార్యాలయంపై దాడి చేసిన దేవినేని అవినాష్‌కి గన్‌మెన్లు ఇచ్చారని తెలిపారు. బూతులు తిట్టే నానిలకు, వంశీకి భద్రత పెంచిందన్నారు. వల్లభనేని వంశీ మాత్రం మాట్లాడకూడని మాటలు మాట్లాడాడని, అతన్ని మాత్రం వదిలే ప్రసక్తే లేదని, శిక్ష పడాల్సిందే అన్నారు. ఐదేళ్లల్లో తాము ధైర్యంగా పోరాడి నిలబడ్డామన్నారు. అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

బొమ్మల తయారీలో శిక్షణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: బొమ్మల తయారీ అభివృద్ధికి డిపిఐఐటి (డిపార్టుమెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్)తో ఫ్లిప్‌కార్డు భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు సంస్థ కార్యదర్శి రాజేష్ కమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో బొమ్మల తయారీ రంగంలో నైపుణ్యతపై శిక్షణా కార్యక్రమం వర్క్‌షాపును నిర్వహించారు. ఈసందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ బొమ్మల తయారీలో మన దేశాన్ని ప్రపంచ వ్యాప్త తయారీకేంద్రంగా మార్చడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్క్‌షాపులో భాగంగా ఇంటరాక్టివ్, ఫ్లిప్‌కార్డు నిపుణుల నేతృత్వంలో చర్చలు, నాణ్యత మెరుగుదల, నూతన ఆవిష్కరణలు వంటి వాటిపై శిక్షణ అందించినట్లు తెలిపారు.

16న అన్నదానం

ప్రజాశక్తి-నందిగామ: చెరువు బజార్ సాయినగర్‌లోని సాయిబాబా మందిర 23వ వార్షిక మహోత్సవాలు శుక్రవారం నుండి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు దెందులూరి కృష్ణశాస్త్రి, ఆలయ ధర్మకర్త అమ్మవరపు మల్లికార్జునరావు తెలిపారు. శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పూజలు, ఆదివారం మహా పూర్ణాహుతి అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు శ్రీనివాసా థియేటర్ వద్ద ఇటీవల విద్యుత్ షాక్ సర్క్యూట్ సంభవించి అగ్ని ఆహుతై సర్వం కోల్పోయిన కేరళ హోటల్ కుటుంబానికి కార్ ట్రావెల్స్‌కు చెందిన యజమానులు గురువారం సహాయం అందజేశారు. కార్స్ ట్రావెల్స్‌కి చెందిన ఎస్‌కె చోటు, పగుట్ల చంద్రయ్య 50 కిలోల బియ్యం, భవన నిర్మాణ రంగ కార్మికులైన రాయల ఆదినారాయణ, కోలేటి గోపాలరావు సీలింగ్ ఫ్యానులు, గొల్లమండల శ్రీను కిరాణా సరుకులు అందజేశారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



ప్రజాశక్తి-నందిగామ: ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పాలనలో సీఎం చంద్రబాబు మార్పు చూపించారని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. మాజీ సీఎం జగన్ ఫొటో ఉన్నా సరే విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని, ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేయవద్దని ఆదేశించినట్లు పేర్కొన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ భవనాలకు అప్పటి ప్రభుత్వం పార్టీ రంగులు వేయించిందని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ భవనాలకు అప్పటి ప్రభుత్వం పార్టీ రంగులు వేయించి నానా హడావుడి చేసిన సంగతి అందరికీ తెలిసిందే. చివరకి చంద్రబాబు పేరుతో ఉన్న శిలాఫలకాలను కూడా ధ్వంసం చేయించిన సందర్భాలు చాలానే ఉన్నాయన్నారు. తనను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందించేందుకు తీసుకురాగా తంగిరాల సౌమ్య పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేశారు.



అక్కల గాంధీకి సన్మానం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా మైలవరం నియోజకవర్గంలో విజయోత్సవ వేడుకలో భాగంగా నియోజకవర్గ జనసేన ఇంచార్జి మరియు అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్‌రావును కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర పార్టీ లో ముఖ్య నేతగా ఉంటూ, గత ఐదు ఏళ్లుగా ప్రభుత్వా వ్యతిరేక పోరాటం చేస్తూ, నేడు మైలవరం కూటమి విజయం అత్యధిక మెజారిటీ సాధించడంలో అ్కల గాంధీ కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఆయనకు జనసేన కార్యకర్తలు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు, వీర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి షావోమి 14 సివి మొబైల్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: టెక్నాలజీ ఆవిష్కరణలో గ్లోడల్ లీడర్ షావోమి సరికొత్తగా 14సివి మొబైల్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె. పవన్ తెలిపారు. కారల్‌మార్క్స్ రోడ్డులోని షోరూమ్‌నందు నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ లైకా కో ఇంజనీరింగ్ టెక్నాలజీతో షవోమి 14 సివి మొబైల్ ఇమేజింగ్ రూపొందించారన్నారు. స్మార్ట్‌ఫోటోగ్రఫలో షవోమి ఎప్పటికపుడు వినూత్న టెక్నాలజీతో అందిస్తుందన్నారు. ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌లతో పాటు అన్ని ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో లభ్యమవుతాయని తెలిపారు.

పాఠశాలలు పున:ప్రారంభం

ప్రజాశక్తి-తిరువూరు: వేసవి సెలవులు అనంతరం గురువారం తిరువూరు మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభిం చారు. తొలిరోజు పాఠశాలలకు స్వల్ప సంఖ్యలో విద్యా ర్థులు హాజరయ్యారు. తిరువూరు పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాల, మండలంలో ని ముష్టికుంట్ల, మునుకుళ్ళ, గానుగపాడు, మల్లేల, కోకిలంపాడు ఉన్నత పాఠశాలలో గత మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సాధించిన ఫలితాలను తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరిస్తూ విద్యార్థుల ను చేర్చుకున్నారు.

ఎన్‌డిఎ కూటమి సంబరాలు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం రాత్రి రెడ్డిగూడెం మండల కేంద్రము ప్రధాన సెంటర్‌లో జనసేన పార్టీ మండల అధ్యక్షులు చాపలమడుగు కాంతారావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివద్ధి కోసం ఎన్డీఏ కూటమిని ఏర్పాటు చేసి సీట్లను కూడా త్యాగం చేసిన గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయబాబు, కాంతారావు, నాగేశ్వరరెడ్డి, సుందరామిరెడ్డి, క్రాంతిబాబు, గోపి, బాలకృష్ణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నాల్గో సారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా, స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆఖండ విజయాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు జాగీర్దార్ మొహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో గురువారం టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని కొండపల్లి జామియా మసీదు(పెద్ద మసీదు) సెంటర్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టుకుదురు శ్రీను, సయ్యద్ గులాం గౌస్, ఎం.ఎ.హైదర్, మొహమ్మద్ జిలానీ, అప్సర్, కాలేషావలి, కరిమికొండ శ్రీలక్ష్మి, అమ్మాజీ పాల్గొన్నారు. **వత్సవాయి:** జనసేన పార్టీ మండల అధ్యక్షులు రేగండ్ల వెంకటరామయ్య గురువారం లింగాల గ్రామం నుండి దుర్గమ్మ దేవాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి గెలుపొందడంతో పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. చిట్యాల గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో ఆయన మాట్లాడారు. **నందిగామ:** ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించిన నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్యకు పెద్దవరంలో క్రక్స్ బయోటెక్ కంపెనీకి చెందిన ఎండి రవిచంద్ర శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి ప్రసాద్, విఆర్‌ఓల సంఘ అధ్యక్షులు రాట కొండ శ్రీనివాసరావు, చావా సతీష్ తదితరులు పాల్గొన్నారు.





నిత్యావసర ధరల్లో దోపిడీ



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల దోపిడీ సాగుతోంది. విజయవాడలో లేని రేట్లు ఇక్కడ ఉంటున్నాయి. వ్యాపారులు ధరలు పెంచి జనాల బేబులు లూటీ చేస్తున్నారు. ధరల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం దుకాణాలపై దాడులు చేసి రేట్లు పరిశీలించిన పరిస్థితి లేదు. ఇలాగైతే జీవనం కష్టమని మహిళలు అంటున్నారు. గన్నవరం పట్టణంలో 30 చిల్లర దుకాణాలు ఉన్నాయి. హెూల్ సెల్ దుకాణాలు పది ఉన్నాయి. వాటిల్లో నిత్యావసర వస్తువుల ధరలు పెంచేశారు. బియ్యం కిలో రూ.40 నుంచి రూ.60, కంది పప్పు కిలో రూ.150 నుంచి 180 అమ్ముతున్నారు. పామాయల్ కిలో రూ.80కి, పంచదార కిలో రూ.40కి పెరిగింది. మినపప్పు కిలో రూ.140, గోధుమ పిండి కిలో రూ. 80, మంచినూనె కిలో రూ.130కి చేరుకుంది. చింతపండు సాధారణ రకం రూ.180, నెంబర్ వన్ రకం రూ. 260లకు చేరింది. విజయవాడ మార్కెట్లో వాటి ధరలు చూస్తే ఏదైనా వస్తువు ధరలో కిలోకి నూ.10 నుంచి రూ.20 తేడా ఉంటుందని తెలిపారు. గన్నవరంలో వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి జనాలను దోపిడీ చేస్తు న్నారని విమర్శిస్తున్నారు.

ఉల్లి కిలో రూ.40 : ఉల్లిపాయలు ధర పెరిగాయి. పాతవి కిలో రూ.40, కొత్తవి కిలో రూ.30 నుంచి రూ.32 ధర పలుకుతోంది. ఈధరలు వింటే వినియోగదారులు ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి దిగుమతి చేస్తున్నారు. వ్యాపారులు కొరత సృష్టించి ధరలు పెంచారనే వాదనుంది. కిలో 40 ధర చెబితే వాటిని కొనలేమని మహిళలు అంటున్నారు. కొత్త పాయలు కొంటే అవి కుళ్లిపో తున్నాయని చెప్పారు. ఉల్లి ధరలు బాగా పెరిగినా పట్టించుకునే అధికారులు లేరని జనాలు మ డిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వ్యాపార దుకాణాలపై దాడులు చేసిధరల నియంత్ర ణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎక్కడా లేని రేట్లు గన్నవరంలోనే : దుర్గమ్మ



ఎక్కడా లేని రేట్లు గన్నవరంలో ఉంటున్నాయి. ఇక్కడ ఉల్లితో పాటు సరకుల ధరలు బాగా వసూలు చేస్తున్నారు. ఈవిధమైన దోపిడీ ఎక్కడా ఉండదు. అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదో తెలియడం లేదు. దాడులు చేయకుంటే సామాన్యుల జీవనంచాలా కష్టమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

ఈ దోపిడీకి అంతం ఎప్పుడో : లక్ష్మి



భారీగా పెరిగిన సరకుల ధరలు పరేషాన్కి గురి చేస్తున్నాయి. చికెన్ రేటు కిలో 290, మటన్ రూ.1000 అమ్ముతున్నారు. చేపలు కిలో రూ.180లకు చేరింది. కందిపప్పు, మంచినూనె ధరలు పెరిగాయి. వ్యాపారులు అధిక రేట్లకు విక్రయాలు చేసి జేబులు నింపుకుంటున్నారనే విమర్శ ఉంది. అధికారులు రంగంలో దిగి దాడులు నిర్వహిస్తేనే రేట్లు అదుపులోకి వస్తాయి. సరకుల దుకాణా ల్లో విపరీతంగా దోపిడి సాగుతోంది. ప్రవేటు వ్యాపారులను అదుపు చేయాల్సిందే. సరకుల ధర లతో భోజనం హెూటళ్లల్లో రేట్లు పెంచారు.



అడ్మిషన్ తీసుకుంటున్న సిఐ శ్రీనివాసరావు

కుమారుడిని ప్రభుత్వ స్కూలులో చేర్పించిన సిఐ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో ఉంటున్న విజయవాడలోని మాచవరం సిఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు తన కుమారుడు హేమ కేశసాయి 3వతరగతి ప్రవేశం కోసం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్ర భవానికి గురువారం దరఖాస్తు ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాల కన్న తల్లి లాంటిదని ఆయన అన్నారు. పోలీస్ అధికారి' ప్రభుత్వ పాఠశాలపై తనకున్న ప్రేమను చూపడం విశేషం.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చారిత్రాత్మకం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు రైతులకు శాపంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడంపై సంతకం చేయడం చరిత్రలో నిలిచిపోతుందని అవనిగడ్డ బార్ అసోసియేషన్ కార్యదర్శి రాయపూడి వేణుగోపాలరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి ఏకపక్షంగా తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ను ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రద్దు చేశారని, ఇందుకు ముఖ్యమంత్రికి ఆంధ్రప్రదేశ్ న్యాయవాదులందరూ కతజ్ఞతలు తెలియజేస్తున్నారని తెలిపారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై మొదటి సంతకం పెడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు గురువారం సంతకంచేయడం పట్ల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ డిఎస్సి అభ్యర్థులతో కలిసి చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గురువారం అవనిగడ్డ రాజు సెంటర్లో నిర్వహించిన కార్యక్రమంలో బుద్ద ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య వి శయతాండవం చేస్తున్న తరుణంలో ఆర్థికంగా రాష్ట్ర వెనకబడి ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని బుద్ద ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా కుదించబడిన పాఠశాలలను సైతం తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. దీనితోపాటు భూములపై మనకున్న హక్కులను కాలరాసే విధంగా జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టర్ రద్దు చేయడంపై రెండో సంతకం చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు జనసేన పార్టీ మండల అధ్యక్షులు గురువాక శేషబాబు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, జనసేన మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు పు షడపు రత్న గోపాల్, రాష్ట్ర బీసీ సంఘం నాయకులు చిలకలపూడి పాపారావు, ఎంపీటీసీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న బుద్ద ప్రసాద్

పూడికతీత పనులను ప్రారంభించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలోని పంట కాలువలు డ్రైనేజీ కాలువల పూడికచేత పనులు వేగవంతం చేసి చివరి భూముల వరకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ద ప్రసాద్ ఇరిగేషన్ అధికారుల కు ఆదేశించారు. గురువారం బుద్ద ప్రసాద్ ఇంటి వద్ద ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఏటా వేసవికాలంలో చేయాల్సిన కాలువల పూడిక చేత పనులు మురుగు కాలవల మరమ్మత్తుల పనులు ఇప్పటివరకు ఎందుకు నిర్వహించలేదని అధికారులను ప్రశ్నించారు. పంట కాలవల లాకుల మరమ్మత్తుల సైతం చేయించకుండా అధికారులు తాచారం చేస్తున్నారని వారిపై మండిపడ్డారు. చివరి ఆయకట్టు ప్రాంతాలైన కోడూరు మండలంలోని ఇరాలి రామకష్ణాపురం నాగాయలంక మండల పరిధిలోని సొర్లగొంది గుల్లల మోద ప్రాంతాల వరకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఔట్ ఫాల్ స్లూయిస్ గేట్ల విషయంలో సైతం త్వరితగతిన తనకు నివేదిక అందించాలని, సిబ్బంది తక్కువగా ఉన్నచోట్ల కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బందిని నియమించుకొని పనులు వేగవంతం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పులిగడ్డ ఆక్విడెక్ట్ మరమ్మత్తుల పనులు సైతం నేటి వరకు ఎందుకు నిర్వహించలేదని ఇరిగేషన్ డి ఈ రవికిరణ్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పులిగడ్డ సబ్ డివిజన్ ఇరిగేషన్ డి ఈ రవి కిరణ్ తో పాటు ఏఈలు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రావు కూడా పాల్గొన్నారు

విద్యా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యార్థులు ఉన్నత విద్యావంతులు కావాలని జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి కోరారు. గురువారం చల్లపల్లి మండలంలోని పురిటి గడ్డ మంగళాపురం కొత్త మాజేరు వక్కలగడ్డ గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్స్ పంపిణీని ఆమె ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ పిట్టి వెంకటేశ్వరమ్మ, పురిటిగడ్డ ఎంపీటీసీ రాజులపాటి అంకమ్మ, పురిటిగడ్డ, వక్కలగడ్డ సర్పంచులు మాతంగి రమ్య, వల్లూరు ఉమా, హెచ్ఎంలు ఎన్.వి.ఎస్ శర్మ, రమణ, నాయకులు రాజులపాటి శివప్రసాద్ పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

• మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

ప్రజాశక్తి-ఉంగుటూరు : యువతరం రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. అమరావతి ఉద్యమం విలువైన పాఠం నేర్పిందని అన్నారు. గురువారం మండలం లోని ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ లో స్వయం ఉపాధి శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ అమరావతి రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, మహిళలు, ఇతర వర్గాల ప్రజలు 1631 రోజులపాటు శాంతియుతంగా ఉద్యమం చేయడం గొప్ప విషయం అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, యువతలో నిజాయితీ ఉంటుందని, వారు వస్తే రాజకీయాలు బాగుపడతా యన్నారు. రాజకీయాలంటే ఈసడించుకునే పరిస్థితిని కొంతమంది నేతలు తీసుకొచ్చారని, అది మారాలంటే యువతకే సాధ్యం అన్నారు. అవినీతికి పాల్పడే వారికి శాసనసభల్లో ఇష్టానుసారం వ్యవహరించే వారికి అరాచకాలకు పాల్పడే వారికి ప్రజలు అవకాశం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారు అన్నారు. ఈ విషయాన్ని నేతలు గుర్తించుకోవాలి అని అన్నారు. స్వర్ణ భారతి ట్రస్ట్ ద్వారా ఎన్నో ఉపయుక్తమైన కోర్సులను యువతకు అందిస్తున్నామని ఫలితంగా మహిళలు ఆర్థిక స్వావలంబన తో జీవించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం శిక్షణ పత్రాలను సమర్పించారు.



శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులతో వెంకయ్యనాయుడు

చెరువులో గుర్రపుడెక్క తొలగింపు



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రక్షిత మంచినీటి చెరువులో నాచు, గుర్రపు డెక్కను తొలగించడం గురువారం ప్రారంభించినట్లు కార్యదర్శి ఏజేయల్ నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో నాగేశ్వరరావు ఆదేశాల మేరకు గ్రామస్తులు అనారోగ్యాలకు గురికా కుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా గ్రామంలో దోమల మందును ప్రతి వార్డులో స్ప్రే చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మంచినీటి చెరువులో నాచు గుర్రపు డెక్క నిండిపోవడంతో వాటిని తొలగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ లను శుభ్రపరచి బ్లీచింగ్ చల్లించుటం చేసినట్లు తెలిపారు.

రాజధాని అభివృద్ధి పనులను వేగంగా చేయాలి

- రైతులు, అసైన్డ్ రైతులకు పెండింగ్ కౌలును సత్వరం జమ చేయాలి
- విభజన చట్టం హామీల అమలుపై కేంద్రంపై టిడిపి, జనసేన ఒత్తిడి చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, జిల్లా కార్యదర్శి రామారావు


మాట్లాడుతున్న రామారావు

ప్రజాశక్తి - తాడేపల్లి

రాజధాని గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, రైతులకు, అసైన్డ్ రైతులకు పెండింగ్ ఉన్న వార్షిక కౌలును వారి అకౌంట్లో వెంటనే జమ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఉండవల్లిలోని సిపిఎం కార్యాలయంలో ఈమని రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రధానినరేంద్ర మోడీ రాజధాని అభివృద్ధికి నిధులు ఇస్తామని వాగ్దానం చేసి కూడా నిధులు ఇవ్వలేదని, ప్రస్తుతం టిడిపి, జనసేన మిత్రపక్షంగా ఉన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని రాజధాని అభివృద్ధికి నిధులు,రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కోసం పట్టుబట్టాలని కోరారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బిజెపి మతోన్మాద ఎజెండాను ప్రజలు తిరస్కరించి ఆ పార్టీ స్థానాలను తగ్గించారని, మోడి గ్రాఫ్ పడిపోయింది అనడానికి ఇది నిదర్శనమని చెప్పారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మోడి ప్రధాని అయ్యాక పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా ప్రైవేట్ సంస్థలకు, కార్పొరేట్ శక్తులకి అప్పగిస్తున్నారని విమర్శించారు. మోడి తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలను మానుకోవాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో 22 వేల కుటుంబాలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసం ఉంటున్నాయని, తాము అధికారంలోకి వస్తే వీరందరికీ ఇళ్ల పట్టాలిస్తామని లోకేష్ హామీ ఇచ్చారని, తాడేపల్లిలో శిలాఫలకాన్నీ వేశారని గుర్తు చేశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన లోకేష్ తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లలో నివసిస్తున్న వారికి బ్యాంకు అధికారులు బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు ఇస్తుండడంతో లబ్ధిదార్లు ఆందోళన చెందుతున్నారని అన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు సిఆర్‌డిఎకు డిపాజిట్ రూపంలో చెల్లించిన డబ్బులను తిరిగి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈ సమస్య వచ్చిందని తెలిపారు. ఇళ్ల లబ్ధిదారులకు చెల్లించాల్సిన డబ్బులను వారి ఖాతాల్లో వెంటనే జమ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఎం.భాగ్యరాజు, వి.వెంకటేశ్వరరావు, సిహెచ్ సుందర్రావు, ఎస్.కె.ఎర్రపేరు, జి.కృష్ణ, జి.నాగేశ్వరరావు, షేక్ గని, ఎం.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



వేతనం పెంచాలని త్రిపుల్ ఐటి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వేతనం పెంచాలని నూజివీడు త్రిపుల్ఐటి ఉద్యోగులు క్యాంపస్‌లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు సంవత్సరాల నుంచి జీతాలు పెంచకుండా తమను వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆర్‌జియుకెటి వైస్ ఛాన్సిలర్ కెసి రెడ్డిని యూనివర్సిటీలోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. యూనివర్సిటీ అక్రమాలకు నిలయంగా మారిందన్నారు. ఆరేళ్ల నుంచి జీతాలు పెంచకుండా ఉద్యోగుల జీవితాలు నాశనం చేశారని విమర్శించారు. అనంతరం ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శన చేశారు.

పాఠశాలలో చోరీ

వంట సామాగ్రి అపహరణ

ప్రజాశక్తి-ముసునూరు: మండలంలోని గోపవరం గ్రామంలో బిసి ఏరియా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చోరీ జరిగింది. పాఠశాలల పున:ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లారు. పాఠశాలలో తరగతి గది, వంట గది తాళాలు పగలకొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా వంట గదిలోని వంట సామగ్రిని దొంగలు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ వాసు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-ముదినేపల్లి: బస్సుల విషయమై ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణల కత్తితో దాడి చేసి గాయపరిచే పరిస్థితికి దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముదినేపల్లిలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు చెందిన బస్సులను తమకు అప్పగించాలంటూ గతంలో ఈ స్కూల్‌ను నడిపిన పాత యాజమాన్యం ప్రస్తుతం ఈ స్కూల్‌ను నడుపుతున్న కొత్త యాజమాన్యాన్ని కోరింది. అయితే ప్రస్తుతం ఈ స్కూల్‌ను నడుపుతున్న బలుసు నితిన్ స్కూల్ బస్సులు సొసైటీ పేరు మీద ఉన్నాయని, మీకు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఏమైనా ఉంటే లీగల్‌గా చూసుకుందాం, బస్సులు మాత్రం మీకు ఇచ్చేది లేదంటూ తనను ప్రశ్నించిన పాత యాజమాన్యం బలుసు సాయి సుమిత్‌తో ప్రస్తుత స్కూల్ యాజమాన్యం బలుసు నితిన్ అన్నాడు. దీంతో నితిన్‌కు సాయి సుమిత్‌కు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సాయి సుమిత్ కత్తితో నితిన్‌పై దాడి చేయడంతో నితిన్ చిటికిన వేలుకు గాయమైనట్లు పోలీసులు తెలిపారు. నితిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.వెంకటకుమార్ తెలిపారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-మండవల్లి: విత్తన శుద్ధితోనే వరి పైరులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎడిఎ వెంకటమణి తెలిపారు. మండలంలోని కానుకొల్లులో రైతులకు రాయితీపై వరి విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా వరి విత్తనాలకు సూడోమోనాస్, బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. దీంతో మొదటి 30 రోజుల వరకు తెగుళ్ల బారిన పడకుండా వరి పంటను కాపాడుకోవచ్చన్నారు. అందువల్ల అధిక దిగులు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎంటియు 7029, 1194, 1044, ఎంటియు 1061, ఎంటియు 1318 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు రాయితీపై అందిస్తున్నామని చెప్పారు. కేజీకి రూ.ఐదు చొప్పున 30 కేజీలు రూ.150 రైతులకు రాయితీపై అందిస్తామన్నారు. కావాల్సిన రైతులు కానుకొల్లు, పెరిగేగూడెం, గన్నవరం, విఎఎలను సంప్రదించాలని తెలిపారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేసి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగదాస థామస్ ఎఒ జరీనా, రైతులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ రచ్చ

పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

ముదినేపల్లి : మండలంలోని వడాలిలో గురువారం టిడిపి, వైసిపి నాయకుల మధ్య ఫ్లెక్సీ ఏర్పాటు విషయమై వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరు పార్టీల నాయకులు ఘర్షణకు దిగే పరిస్థితిలో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చా రు. వివరాల ప్రకారం.. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం సందర్భంగా సిఎంకు శుభాకాంక్షలు తెలుపుతూ వడాలి ప్రధాన సెంటర్‌లో టిడిపి నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటిలో ఒక ఫెక్సీని సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహా నికి, ఆ పార్టీ జెండా దిమ్మెకు సపోర్ట్ చేసుకుని కట్టారు. ఈ ఫ్లెక్సీ ఏర్పాటు కారణంగా వైఎస్ఆర్ విగ్రహం కనిపించకపోవడంతో పాటు జెండా దిమ్మెకు అనిచ్చి ఫెక్సీ ఏర్పాటు చేయడంతో వైసిపి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీ అక్కడి నుంచి తొలగించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టిడిపి, వైసిపి నాయకులు మధ్య ఘర్షణ వాతావరణం చేసుకోవడంతో వెం టనే అప్రమత్తమైన పోలీసులు వడాలి చేరుకుని ఇరు పార్టీల నాయకులకు నచ్చచెప్పి వైఎస్ఆర్ విగ్రహానికి అడ్డుగా ఉన్న ఫ్లెక్సీని తొలగించి పక్కన ఏర్పాటు చేసుకోవాలని కోరడంతో పరిస్థితి సద్దుమణిగింది. దీంతో టిడిపి శ్రేణులు ఫ్లెక్సీని అక్కడ నుంచి తీసి పక్కన ఏర్పాటు చేసుకున్నారు.

ఖరీఫ్ పనుల్లో రైతులు సన్నద్ధం

ప్రజాశక్తి -ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. గత పది రోజులుగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతులు వేసవి దుక్కులు ప్రారంభించారు. ట్రాక్టర్లతో చేలను దుక్కులు చేయిస్తూ రైతులు బిజీబిజీగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో అడపాతడపా వర్షపు జల్లులు పడడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. మండలంలోని పలు మెట్ట ప్రాంతాల్లో కొందరు రైతులు తమ పొలాల్లో ట్రాక్టర్లతో దుక్కులు దునుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఎక్కువ శాతం రైతులు వెదజల్లే పద్ధతులు ఖరీఫ్ సాగు చేపడుతున్నారు. అందుకు అనుగుణంగా చేలను సిద్ధం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు చేలల్లో ఉండి ఖరీఫ్ సాగు పనుల్లో గడుపుతున్నారు. వర్షాలు పడితే వ్యవసాయ పనులు మరింత ముమ్మరంగా జరిగే అవకాశం ఉంది.



నిర్వాసితుల సమస్యలపై మాట్లాడతా..!

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

వైసిపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేయడమే కాకుండా నిర్వాసితులకు పరిహారం అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యం, అరాచక పాలన వల్లే రాష్ట్రంలో చంద్రబాబు, పవన్, మోడీ, లోకేష్ నాయకత్వంలో కూటమి ఘన విజయం సాధించిందన్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతగానితనం వల్లే పోలవరం ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని, టిడిపి ప్రభుత్వానికి పేరు వస్తుందనే అహంకారంతోనే చింతలపూడి ప్రాజెక్టు పనులను అర్థాంతరంగా ఆపేశారని విమర్శించారు. గత ప్రభుత్వం సహకారం లేక జిల్లాలో పామాయిల్ రైతులు ఇబ్బందులు పడుతున్నారని, చంద్రబాబు హయాంలో ఉద్యానవన అభివృద్ధికి, డ్రిప్ ఇరిగేషన్‌కు, ఇతర వ్యవసాయ పరికరాలకు, యాత్రీకరణకు సబ్సిడీలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లాలో మామిడి రైతులు కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటుంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించిందన్నారు. రానున్న ఐదు సంవత్సరాల్లో పోలవరం పనులు పూర్తిచేసి పూర్తిస్థాయిలో నీరు అందిస్తామని, చింతలపూడి ప్రాజెక్టును రాబోయే రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఆక్వా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, జగన్మోహన్ రెడ్డి అబద్ధపు హామీలతో వారంతా మోసపోయారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లా డి ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఐదేళ్లుగా టిడిపి, జనసేన కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ విషయంలో ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని, కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. తమ ప్రభుత్వంలో వేధింపులు ఉండవన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు సొమ్ములు అందకపోవడాన్ని మీడియా ఆయన వద్ద ప్రస్తావించగా సిఎం దృష్టికి తీసుకెళ్లి డబ్బులు చెల్లించేవిధంగా చూస్తానని, ఈ విషయంపై త్వరలో అధికారులతో సమీక్షిస్తామని తెలిపారు. టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ టిడిపి కూటమికి అఖండ విజయం చేకూర్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, చింతలపూడి ఎంఎల్ఎ సొంగ రోషన్‌కుమార్, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పలుచోట్ల 'మన అంగన్వాడీ పిలుస్తోంది'




ఉంగుటూరులో...


పెదపారుపూడిలో...


కంకిపాడులో...


పమిడిముక్కలలో..

ప్రజాశక్తి-ఉంగుటూరు : చిన్నారులకు విద్యావకాశాలు అందించేందుకు అంగన్వాడీ ప్రీ స్కూల్‌లో చేర్పించాలని నాగవరప్పాడు స్కూల్ టీచర్ కె. మార్తమ్మ అన్నారు. 'మన అంగన్వాడీ పిలుస్తుంది' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నాగవరప్పాడు స్కూల్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా మార్తమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ స్కూల్‌లో పిల్లలకు అన్నిరకాల ఆటలు పాటలు అక్షరాలు బోదిస్తున్నామని తమ బిడ్డలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎ ఎన్ ఎం. ఎన్ జె ఆశీర్వాదమ్మ, ఆయా తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** అంగన్వాడీ బాలబాలికలు తమ కోర్సు పూర్తి చేసుకుని స్కూల్లో జాయిన్ చేసే గ్రాడ్యుయేట్ డే ను ఈడుపుగల్లులోని ఎస్సీ కాలనీలో గల సుందరమణి అంగన్వాడి కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిడిపిఓ సుకన్య మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడి ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తల్లులు క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు దరిచేరవని, పిల్లలకు కూడా క్రమం తప్పకుండా తినిపించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్ల ద్వారా అందించే ఆటపాటలతో కూడిన విద్య పిల్లల మనోవికాసానికి ఎంతగానో దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ అన్నా మనీ అంగన్వాడి టీచర్లు మీరాబి, కాజమ్మ సుందరమణి, సునీత, వసంత రామలక్ష్మి, హెల్పర్లు అంగన్వాడి పిల్లల, తల్లులు తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పమిడిముక్కల :** మంచి కార్యక్రమాలు, నైపుణ్యంతో కలిగిన విద్యను నేర్చుకోవడం ద్వారా అంగన్వాడి విద్యార్థులు మంచి జ్ఞానాన్ని సంపాదించుకుంటారని అంగన్వాడి సూపర్వైజర్ ఝాన్సీ అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని కష్ణాపురం హరిజనవాడలో జరిగిన అంగన్వాడి పిలుస్తుంది రా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం, మంచి విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలను వినియోగించుకోవాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్వాడి టీచర్ ఆనంద కుమారి, అంగన్వాడి టీచర్లు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** మండల కేంద్రమైన పెదపారుపూడి 3 అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ అరుణ కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణకుమారి మాట్లాడుతూ మూడు సంవత్సరముల నుండి ఐదు సంవత్సరముల పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని సూచించారు. ఐదు సంవత్సరాల దాటిన పిల్లలందరినీ ఎంపీపీ స్కూల్లో జాయిన్ చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ పిల్లల మేధాభివద్ధికి తగినట్లుగా సిలబస్ బుక్స్, ప్రీస్కూల్ మెటీరియల్ ఉంటుందన్నారు. ఆటపాటల ద్వారా పిల్లలకు బోధనభ్యాసం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.


బాలశౌరిని సన్మానిస్తున్న పెడన చైర్ పర్సన్, కౌన్సిల్ సభ్యులు

బాలశౌరిని కలిసిన చైర్మన్, కౌన్సిలర్లు

ప్రజాశక్తి-పెడన : మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిని పెడన మున్సిపల్ చైర్పర్సన్ కటకం నాగ కుమారి, కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. మున్సిపాలిటీలో ఎంపీ ప్రత్యేక ఆహ్వానితులు కావడంతో మర్యాద పూర్వంగా ఆయనను కలిసినట్లు నాగకుమారి పేర్కొన్నారు. పెడన మున్సిపాలిటీకి ఎంపీ నిధులను కేటాయించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ అభివద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను కేటాయించేందుకు తోడ్పాటు చేయాలని కోరామన్నారు. సీనియర్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, పిచ్చుక సతీష్ బాబు, కౌన్సిలర్లు అబ్దుల్ ఖయ్యూం (బాబూలాల్), కొనసం సత్యనారాయణ, వైఎస్ఆర్సిపి నాయకులు కొమట్ల అనిల్ కుమార్, హమాయన్, దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మెట్ల దుర్గా నాగేశ్వరరావు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ తుల ప్రసాద్ రైతుల రైతుల పాల్గొన్నారు తదితరులు ఎంపీ బాలసౌరికి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలు కప్పి సన్మానించారు.

గురుకులం పున:ప్రారంభం


పాల్గొన్న దాసరి వెంకట బాలవర్ధనరావు

ప్రజాశక్తి-ఉంగుటూరు : గురుకులం అనేది ఒక విశిష్టమైన విద్యాభ్యాసం అందించే పవిత్రమైన దేవాలయం అని, గురుకులంలో చదువు కున్న బాల బాలికలకు విద్యను బోధించడం తో పాటు చతుష్షష్టిలో ఉన్న 64 కళలను బోధిస్తారని గన్నవరం మాజీ శాసనసభ్యులు, శ్రీ జయరామ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధన రావు అన్నారు. గురువారం ఉంగుటూరు శ్రీ జయ రామ విజ్ఞాన విహార్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రాంగణంలో నెలకొల్పిన శ్రీ నివేధిత గురుకులం పునః ప్రారంభోత్సవ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలవర్తనరావు మాట్లాడారు. నివేదిత గురుకులం అనేది ఒక విశిష్టమైనదని చదువుతోపాటుగా అన్ని రకాల కళారూపాలను పిల్లలకు అందించడం దీని ప్రత్యేకత అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దార్ధ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ చదలవాడ సుధా, డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు , సిద్దార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, శ్రీ విజ్ఞాన విహార్ కార్యదర్శి ఎం గోవిందరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సావిత్రి పాల్గొన్నారు.

విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి చల్లపల్లి : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అవనిగడ్డ నియోజకవర్గం మచిలీపట్నం పార్లమెంట్ స్థానాలలో కూటమి తిరుగులేని అఖండ విజయం సాధించటంతో మండలంలోని పలు గ్రామాలలో విజయోత్సవ సంబరాలు జరుపుకుం టున్నారు. గురువారం మండల పరిధిలోని నాదెండ్లవారి పాలెంలో సంబరాలు జరిగాయి. ఈ సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న అవనిగడ్డ నియోజకవర్గం శాసనసభ్యులు మండల బుద్ధప్రసాద్ కేకు కట్ చేశారు.ఈ కార్యక్రమంలో యువనేత మండలి వెంకట్రామ్, టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, నాదెళ్ల వెంకట నరసయ్య, గుత్తికొండ వంశీకష్ణ, వడ్లమూడి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి శిలాఫలకం ధ్వంసం

- ఖండించిన నాయకులు వేమారెడ్డి

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : ఏంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం అభివృద్ధి పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు బుధ వారం ధ్వంసం చేశారు.ధ్వంసం చేసిన విగ్రహం శిలాఫలకంను వైసీపీ ఏంటీఏం సి నగర అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి ఇతర వైసీపీ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు వేమారెడ్డి మాట్లాడుతూ విగ్రహాలు ధ్వంసం చేయడం సరైంది కాదని అన్నారు. ఇటువంటి చర్యలు మంచిది కాదని హితవు పలికారు. అనంతరం వైఎస్ఆర్సిపి నాయకులు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమం పట్టణ అధ్యక్షులు బుర్ర ముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, వైఎస్ఆర్సిపి తాడేపల్లి పట్టణ నాయకులు మేకా అంజి రెడ్డి, పాటి బండ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి : రైతు సంఘం


మాట్లాడుతున్న గౌరిశెట్టి నాగేశ్వరావు

ప్రజాశక్తి - గుడివాడ : ప్రతి రైతుకి నాణ్యమైన విత్తనాలు అందించాలని రాష్ట్ర రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకి అవసరమైనటువంటి విత్తనాల్ని సర్టిఫైడ్ విత్తనాలు సమీకరించి రైతులుకి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. అలాగే ఇరిగేషన్ డ్రైనేజీ కాలువలు చాలా కాలంగా మరమ్మతులు లేకుండా ఉన్నాయని, వాటికి కూడా మరమ్మతులు చేయాల్సినటువంటి అవసరం ఉందని అన్నారు. లేకపోతే రైతాంగం సాగునీటికి చాలా ఇబ్బందులు పడేటువంటి అవకాశం ఉందని తెలిపారు. రైతులందరికీ కౌలు కార్డులు ఇచ్చి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు కూడా సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పంట నష్టపరిహారం కూడా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా రైతాంగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం అకతాయిల పనే

- టిడిపి నాయకులు వీరిశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : చిర్రావూరులో బుధ వారం రాత్రి జరిగిన వైయస్సార్ విగ్రహం ధ్వంసంలో టిడిపి, జనసేన నాయకులు చేశారనేది అవాస్తవమని టిడిపి చిర్రావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం ఏం టీ ఎం సీ పరిధిలోని చిర్రావూరు టిడిపి కార్యాల యంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వీరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విగ్రహాలు ధ్వంసం చేసే అలవాటు తమకు లేదని అన్నారు.ఆకతాయిలు చేసిన పనికి తామే చేశామని వైసిపి వారు చెప్పడం సరైంది కాదని అన్నారు. విగ్రహ ధ్వంసం టిడిపి, జనసేన చేసిందని అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి లాల్ చంద్,ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్, జనసేన పార్టీ గ్రామ కమిటీ ఉపాధ్యాక్షులు పోకల శివయ్య, జట్టి రవేంద్ర బాబు పాల్గొన్నారు.

అన్నదానం


ప్రజాశక్తి-తాడేపల్లి : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా, గురువారం ముఖ్యమైన ఐదు ఫైల్స్‌పై సంతకాలు పెట్టి పాలనా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పెనుమాకలో 4,500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ జాతీయ అభిమాన సంఘం అధ్యక్షులు పాలెపు రామారావును శాలువాతో ఘనంగా సత్కరించారు. పెనుమాక ప్రథమ సొసైటీ అధ్యక్షులుగా పని చేయడంతో పాటు సినీ ఇండస్ట్రీకి ముఖ్యంగా ఎన్‌టిఆర్ జాతీయ అభిమాన సంఘం అధ్యక్షులుగా పని చేశారని టిడిపి మండల అధ్యక్ష, కార్య దర్శులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు అభినందించారు. ఇకపై అమరావతిలో పాలన దిగ్విజయంగా కొనసాగుతుందని హామీనిచ్చారు. రైతులకు బకాయి ఉన్న వార్షిక బకాయిలు కూడా త్వరలోనే రైతుల బ్యాంకు అకౌంట్లో జమ చేస్తారని చెప్పారు. కళ్లం రాజశేఖరరెడ్డి, పటాన్ జానీఖాన్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు అందజేత

ప్రజాశక్తి పెదపారుపూడి : విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల విద్యాశాఖ అధికారి బొడ్డు శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతంగా శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీ



ప్రజాశక్తి-కంచికచర్ల: గురువారం నుండి పాఠశాలలు తెరుచుకున్నాయి. మండలంలో 7 జిల్లా పరిషత్, 7 మండల పరిషత్ ప్రాథమికోన్నత, 27 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇవికాక మరో 14 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాడునేడు ద్వారా పనులు పూర్తయిన పాఠశాలల్లో రంగులు వేసి ముస్తాబు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, ఇతర సామాగ్రి ఆయా పాఠశాలలకు చేరాయి. రెండు రోజుల్లో విద్యార్థులకూ సకాలంలో అందజేయాలని అధికారులు పాఠశాల సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం


కంచికచర్ల మండలంలో ప్రైవేటు పాఠశాలల దోపిడీ అంతా ఇంతా కాకుండా ఉంది. పైకి సేవా సంస్థ పేరుతో, యాజమాన్యం విద్యను వ్యాపారంగా మార్చి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ దోచుకుంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక గొట్టుముక్కల రోడ్లలో ఓ సంస్థ పేరుతో 40 ఏళ్లకు పైగా నడుపుతున్న ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నర్సరీ నుండి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థి నుండి 20 వేలకు పైగా ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నారని తల్లిదండ్రుల పేర్కొంటున్నారు. పాఠశాలలో పుస్తకాలు, యూనిఫారం, షు, టై, బెల్టు ఇతరత్రా పేరుతో మరో 20 వేలు వసూలు చేస్తున్నారని అంటున్నారు. పాఠశాల్లో యాజమాన్యాలే పుస్తకాలు, యూనిఫారం పేరుతో వ్యాపారం చేయకూడదనే నిబంధన ఉన్నా బహిరంగంగానే ఏటా ఒక్కో పాఠశాలలో కోటి రూపాయలకు పైగా పూస్తకాల వ్యాపారం నిర్వహిస్తున్నారని తల్లిదండ్రుల అంటున్నారు. ఎవరైనా పేదలు అదే పాఠశాలలో పుస్తకాలు, యూనిఫారం అధిక ధర పెట్టి కొనలేక బయట కొనుక్కుంటామంటే, బయట పుస్తకాలు సిలబస్ వేరే ఉంటది. మా దగ్గరే కొనాలని నిబంధన పెట్టి పేదా సాదా చూడకుండా ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. 1వ తరగతి నుండి 5 వరకు రూ.15 వేల నుండి రూ. 20వేల వరకు, 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు రూ. 20వేల నుండి రూ.25వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా సిబిఎస్ఇ పేరుతో పెట్టిన స్కూళ్లలో రూ.20వేల నుండి రూ. 50వేల వరకు ఫీజు వసూళ్లు చేస్తున్నారు. అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో సీటు అడ్వాన్స్ పేరుతో ఒక్కో విద్యార్థి నుండి మరో రూ.2 వేలు అదనం. ప్రైవేటు పాఠశాలల్లో కంచికచర్లలో వ్యాన్ ఫీజు ఒక్కో విద్యార్థికి నెలకు 800 నుండి 1000 వసూలు చేస్తున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో గ్రామీణ ప్రాంతాల నుండి ఒక్కో విద్యార్థికి నెలకు 2000 వరకు వసూలు చేస్తున్నారు. నర్సరీ పూస్తకాలు 5 వేలకు పైగా, 1 నుండి 5వ తరగతి వరకు 8 నుండి 10 వేల వరకు వసూలు చేస్తున్నారు. కంచికచర్లలో మరికొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యాల దోపెడీకి పేద పిల్లల తల్లిదండ్రులు విద్యను కొనలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల్లో ఇంత దోపిడీ జరుగుతున్నా, దోపిడీని నివారించాల్సిన విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం ఇవ్వాలి : సత్యబాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్‌లో గల మరుపిళ్ళ చిట్టి ప్రాథమిక పాఠశాలను కార్పొరేటర్ బోయి సత్యబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ విషయమై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే ఇంకా రాలేదని వారు సమాధానం తెలిపారు. పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫార్మ్ పంపిణీ చేయవలసిన విద్యాశాఖ ఎందుకని ఇంకా పంపిణీ చేయలేదని మండల విద్యాశాఖ అధికారికి చరవాణి ద్వారా తెలియపరచడం జరిగింది. ఒకటి రెండు రోజుల్లో పాఠ్యపుస్తకాలు యూనిఫాం స్కూలుకి పంపిస్తామని సంబంధిత ఎంఈఓ తెలియపరిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అడ్మిషన్లు పెరుగుదల అయ్యేవిధంగా ఉపాధ్యాయుల కషి చేయాలని కోరారు. స్థానిక శానిటరీ ఇన్స్పెక్టర్ మంచినీటి వాటర్ ట్యాంక్ పరిశుభ్రంగా చేసి ఆర్ఓఆర్ ప్లాంట్ ద్వారా మంచినీటి సరఫరా ఇవ్వాలని సత్యబాబు కోరారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు





ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామిని దర్శించుకునేందుకు దుర్గగుడికి కుటుంబసభ్యులతో కలిసి విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి గురువారం వచ్చారు. వీరికి ఆలయ ఈవో కె.ఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఈవో శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రములు, చిత్రపటం అందజేశారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మైలవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులుగా తిరుమల శెట్టి శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



శ్రీధర్



నాగప్రసాద్



నాగభూషణం

లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం జనరల్ బాడీ సమావేశం లైన్స్ పూర్వపు గవర్నర్ ఎస్వీఎన్ నివృతరావు అధ్యక్షతన మైలవరంలోని ఆయన కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సెక్రెటరీగా చనుమోలు నాగభూషణం, ట్రెజరర్ గా కొల్లిపర నాగ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ఎస్వీఎన్ నివృతరావు మాట్లాడుతూ లయనిజమంటే సేవ అని సేవ చేయటం ద్వారానే గుర్తింపు వస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ పూర్వ అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, లయన్స్ మెంబర్లు కోట పుల్లారెడ్డి, సిహెచ్ బాలగోపాల్ రెడ్డి, లేళ్ల ఏడుకొండలు, తిమ్మన దినేష్ బాబు, తాడేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో లోపాలపై సమీక్ష



లీకేజీలను పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణ పురపాలక సంఘ పరిధిలో తాగునీటి సరఫరా విషయంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ మరియు సంబంధిత ఎమినిటీ కార్యదర్శులు పర్యవేక్షించారు. తాగునీటి సరఫరా విషయంలో తీసుకొనవలసిన జాగ్రత్తలు సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మెయిన్ పైప్‌లైన్‌పై లీకేజీల గురించి, మోటార్లు సక్రమంగా నిర్వహణ, క్లోరినేషన్ మరియు ఇంటెక్ వెల్ నందు ప్యూరిఫికేషన్, పైప్ లైన్ లీకేజీలు వంటి వాటిపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మరియు కార్యదర్శులతో ఆయా ఏరియా త్రాగునీటి సరఫరా పై ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైప్ లైన్ పెద్ద లీకేజీలు ఎక్కడా కూడా తమ దష్టికి రాలేదని తెలిపారు. సాధారణంగా వచ్చు చిన్నచిన్న లీకేజీల సమస్యను పరిష్కరించుటకు చర్యలు తీసుకొనుట జరుగుతుందన్నారు. గత 20 సంవత్సరముల పైబడి పట్టణంలో రోజుకు ఒక సారి మాత్రమే త్రాగునీటి సరఫరా చేయుట జరుగుచున్నది, ప్రజలు స్వచ్ఛందంగా వారి ఇంటికి ఉన్న మోటర్లను తొలగించి పురపాలక సంఘమునకు సహకరించాలని కోరారు. వర్షాకాలం దష్ట్యా అంటువ్యాధులు ప్రభలకుండా శానిటేషన్ మరియు ఎమినిటీ కార్యదర్శులు సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అసిస్టెంట్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రతి రోజు క్లోరినేషన్, ఫిల్టరేషన్ వద్ద అన్నీ రకాల చర్యలు తీసుకోవలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా అంటు వ్యాధులు ప్రభల కుండా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు.



అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-వన్‌టౌన్: టిడిపి ఉత్తరాంధ్ర ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సోదరి కాండ్రేగుల జగదీశ్వరి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం వారి నిత్య అన్నదానం ట్రస్టుకి రూ.1,51,116 చెక్‌ను జాతీయ అధ్యక్షులు, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా గురువారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామారావుకి అందజేశారు.

18న వాహనాలు వేలం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని స్పెషల్ అండ్ ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వివిధ వాహనములకు సంబంధించి బహిరంగ వేలం పాటలు ఈ నెల 18వ తేదీ ఉదయం పది గంటలకు తొర్రగుంటపాలెం 14 వీధిలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆఫీస్ పక్కన ఉన్నటువంటి స్పెషల్ అండ్ బ్యూరో స్టేషన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలిచిన వారు మరిన్ని వివరాల కోసం 9440902461, 9490874538 నెంబర్లకు సంప్రదించలని కోరారు.

అన్నదానం

ప్రజాశక్తి-మైలవరం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్థానిక లక్కిరెడ్డి హనీమిరెడ్డి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ ముగింపు సందర్భంగా గురువారం తేజస్విని హాస్పిటల్, లక్కీరెడ్డి హనిమీ రెడ్డి వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజస్విని హాస్పిటల్ డాక్టర్ సతీష్‌బాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్‌బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు ఐ నీడ్స్ పుల్లారెడ్డి, ఏ చంద్రశేఖర్, శివరామిరెడ్డి, కే శివ, మనోహర్, మురళీకృష్ణ, బి.శివకుమార్ రెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, భవ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





సిబ్బందికి కిట్లు అందజేత

ప్రజాశక్తి-కంచికచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాల, యూనిఫారం, స్కూలు బ్యాగ్‌లతో కూడిన కిట్లు పంపిణీ చేయాలని ఎంఈఓ బి బాలాజీ అయా పాఠశాలల సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని ఆయా పాఠశాలల సిబ్బందికి పాఠ్య పుస్తకాల, యూనిఫారం, బ్యాగుతో కూడిన కిట్లు అందజేశారు. మండలంలో 7 జిల్లా పరిషత్, 5 ప్రాథమికోన్నత, 29 ప్రాథమిక పాఠశాల ఉన్నాయన్నారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు 4324 మంది విద్యార్థులకు కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలగా జడ్‌పి పాఠశాల

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలను 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. జలజ పేర్కొన్నారు. ఈ విద్య సంవత్సరంలో ఎంపిసి, సిఇసి కోర్సులకు విధ్యార్థులు నుండి దరఖాస్తులు కోరడమైనదని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో ఆమె కోరారు.